వెళ్లేదెలా?

వర్షాలకు రహదారిపై నిలిచిన నీరు

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు తప్పని తిప్పలు
- సమస్యలకు నిలయంగా మారిన వైనం
- మండలం ఏర్పాటై ఎనిమిదేళ్లు పూర్తయినా సొంత భవనాలు కరువు



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో రోడ్డుపై నిలిచిన నీరు



అద్దె భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు ఆమడదూరంలో ఏర్పాటు చేయడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాలను అనువుగా లేని చోట ఏర్పాటు చేయడంతో వెళ్లేందుకు నిత్యం నరకయాతన పడుతున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు నీట మునిగింది. దీంతో రోడ్డు దాటేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన మండలంగా మనోహరాబాద్ ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువైయ్యాయి. ఇందులో భాగంగానే మండల కేంద్రానికి ప్రభుత్వ శాఖ పరమైన కొత్త భవనాలు వచ్చే వరకు తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేసిన ఉన్నతాధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లు బస్టాప్ నుంచి కిలో మీటర్‌కు పైగా దూరం ఉండటంతో కార్యాలయానికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రోడ్డు వెంట వరద నీరు చేరడంతో అధికారులతో పాటు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు రాకపోకలు సైతం నిలిచిపోవడంతో పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాలు జలదిగ్బంధంలోనే ఉండిపోయాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు.

నిలిచిన నిధులు

సమీకృత భవనాల నిర్మాణ పనులు చేపట్టి స్లాబ్ వరకే నిర్మించి వదిలేశారు. నిధులు రాకపోవడంతో పనులు ముందుకు కొనసాగడం లేదని అధికారులు చెబుతున్నారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని త్వరగా సమీకృత భవనాల నిర్మాణ పనులను పునఃప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

వర్షం వస్తే చెట్ల కిందనే

ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల పరిష్కారం కోసం వచ్చే వినియోగదారులకు కనీస వసతులుండటం లేదని పలువురు వాపోతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఆలస్యంగా వస్తున్నారని, ఈ సమయంలో కనీసం కూర్చునేందుకు కుర్చీలు, తాగునీటి వసతి లేవన్నారు. వర్షం వస్తే చెట్ల కిందనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కనీస వసతులు కరువు



సమస్యల పరిష్కారానికి కార్యాలయాలకు వెళ్లగా.. కనీస వసతులు ఉండటం లేదని వాపోతున్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు లేవు. జిరాక్స్‌లు కావాలంటే మళ్లీ కిలోమీటర్ దూరం ప్రయాణించాల్సి పరిస్థితి ఉంది. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో వసతులు ఏర్పాటు చేయాలి.

– మహిపాల్‌యాదవ్, మనోహరాబాద్

కొత్త భవనాన్ని పూర్తి చేయాలి



రోడ్డుకు సమీపంలో చేపట్టిన ప్రభుత్వ కార్యాలయాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్ భవనం రోడ్డుకు దగ్గర ఉండేలా చూడాలి. ఏదైనా ప్రమాదం జరిగినా సమయానికి అందుబాటులో ఉంటారని చెప్పారు.

– నాగేష్, జీడిపల్లి

యూరియా సరఫరాలో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యూరియా టోకెన్ల కోసం బారులు తీరిన రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ రైతులకు అవసరమైన యూరియాను అందించారన్నారు. ప్రస్తుతం యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెలలో దాదాపు 8 వేల బస్తాలు అవసరమని ఉన్నాయని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు సురేష్‌గౌడ్, దత్తు, మానిక్ రెడ్డి, అంజయ్య, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న సుహాసినిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఉన్నత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రత్నాపూర్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు పిల్లుట్లకి చెందిన బీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండారి గంగాధర్ సమకూర్చిన స్పోర్ట్స్ దుస్తులు, క్రీడా సామగ్రిని సుహాసిని రెడ్డి అందజేశారు. దాతల సహాయ, సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, సుదర్శన్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి రాథోడ్, కిష్టయ్య, అశోక్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆదర్శ యూత్ సభ్యులు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు లతాంబర్‌రావు, యూత్ అధ్యక్షుడు రజనీకాంత్, దుర్గాప్రసాద్, ఆంజనేయులు, సాయి, దేవరాజ్, స్వామి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తాం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య

మెదక్ కలెక్టరేట్: సీతారాం ఏచూరి ఆశయసాధనకు సీపీఎం కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో 'ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజా స్వామిక వాదుల కర్తవ్యం' పేరుతో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, కార్యదర్శి మల్లేశం, కార్యవర్గ సభ్యులు సంతోష్, యశోద, దుర్గ, యాదగిరి, వెంకట్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులతో ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం టీపీయూఎస్ ఆధ్వర్యంలో మన పాఠశాల-మన ఆత్మగౌరవం పేరుతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రంగారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్నశ్రీ, మండల అధ్యక్షుడు భద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని వినతి

టేక్మాల్(మెదక్): మండలంలోని బర్దిపూర్‌లో పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని జిల్లా ఇండియన్ పోస్టల్ అధికారి దౌలత్‌బాషాకు సోమవారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాద్లూర్‌లో పోస్టాఫీస్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. మండల మాజీ వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు పెంటయ్య, సంగమేశ్వర్, యాదగిరి, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం



తునికిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికిలో రెండో రోజు వైద్యశిబిరం నిర్వహించారు. సోమవారం మండల వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్ ప్రతిమ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. అలాగే గ్రామంలో దోమల నివారణకు పంచాయతీ కార్యదర్శి సౌజన్య ఆధ్వర్యంలో పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమేష్, సుశీల, రేణుక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్‌లో సోమవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభించామని ఫిజికల్ డైరక్టర్ సుజాత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఏడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలో రంగంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికలో భాగంగా అండర్-14, అండర్-17 విభాగాల్లో ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. మొదటిరోజు బాలికల విభాగంలో కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్ క్రీడా విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రదానంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్ రెడ్డి, ఆయా పాఠశాల పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంటికుంట చెరువును పరిశీలించిన ఆర్డీఓ



చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

అల్లాదుర్గం(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను, గండిపడిన బంటికుంట చెరువును మెదక్ ఆర్డీఓ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా బంటికుంట గండిపడటానికి కారణాలను తహసీల్దార్ మల్లయ్య ఆర్డీఓకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రాజేశ్, ఆర్ఐలు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మంజీర వరదల ఉధృతి తగ్గలేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రమాదేవి సూచించారు. సోమవారం ఏడుపాయలలోని దుర్గమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం ఘనపురం ఆనకట్ట, మంజీర నది ప్రవాహాన్ని పరిశీలించారు.

పరామర్శ

పాపన్నపేట(మెదక్): మండలంలోని నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ భూదేవి ఇటీవల మరణించారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, కొత్తపల్లి మాజీ డైరెక్టర్ వెంకోబ, మాధవరెడ్డి, పంతుల కిషన్ తదితరులు పరామర్శించారు.

లంబోదరుడికి విశేష పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు జిల్లా వ్యాప్తంగా గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, పిల్లలు, యువకులు లంబోదరుడి పూజల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం గణనాథ మండప నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



నర్సాపూర్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



పెద్దశంకరంపేటలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



హవేళిఘణాపూర్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి వివరాలు తెలుపుతున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం చేశారని గ్రామస్తులు రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి, మైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డిలు సోమవారం ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 539లోని 10 గుంటల భూమిని పలువురు బడా భూస్వాములు కబ్జాచేశారన్నారు. అలాగే సదరు భూమిలో కంటైనర్ ఏర్పాటు చేసి చుట్టూ సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మాణం, కట్టడాలు చేపట్టారన్నారు. ఈ విషయంపై గతంలో డీపీఓ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. రూ.కోట్లల్లో విలువ చేసే ప్రభుత్వ భూములు అక్రమార్కులు కబ్జా చేసినప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. కబ్జాకు గురైన విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని వారిపై చర్యలు చేసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు

యూరియా కోసం రైతన్నలు రోడ్డెక్కారు. కొంతమంది తెల్లవారుజామునే పెద్ద సంఖ్యల్లో రైతులు సహకార సంఘం కార్యాలయల వద్దకు వెళ్లి బారులు తీరారు. గంటల తరబడి క్యూలో నిల్చున్నప్పటికీ కొంతమందికే మాత్రమే యూరియా అందజేస్తున్నారని రోడ్లపై నిరసన వ్యక్తం చేశారు. పలు కేంద్రాల్లో యూరియా ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు నిరసనగా రోడ్లపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో పోలీసులు కలుగజేసుకొని రైతులకు నచ్చజెప్పారు. అనంతరం పోలీసుల బందోబస్తు మధ్య యూరియా టోకెన్లను అందజేశారు.



నర్సాపూర్: సొసైటీ వద్ద యూరియా కోసం తరలివచ్చిన రైతులు



శివ్వంపేట: రాస్తారోకో చేస్తున్న రైతులు



పెద్దశంకరంపేటలో రైతుల బారులు



రామాయంపేట: రోడ్డుపై బైఠాయించిన రైతులు

మంజీరా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండండి

జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కారణంగా మంజీరా ఉధృతి ఏమాత్రం తగ్గలేదని, పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ అన్నారు. సోమవారం ఆయన తహసీల్దార్ సహదేవ్‌తో కలిసి మండల పరిధిలోని చిట్కుల్ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నీటి ముంపు ప్రాంతాల వద్దకు వెళ్లొద్దని సూచించారు.. మంజీరా పరివాహక ప్రాంత రైతులు, చాముండేశ్వరి ఆలయానికి వచ్చే భక్తులు నది తీరంవైపు వెళ్లొద్దన్నారు. నది వద్ద సెల్ఫీలు, రీల్స్ అంటూ ప్రాణాలుమీదికి తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి, ఈసీ భగవాన్ రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లకు తప్పని తిప్పలు



నర్సాపూర్ రూరల్: ఆసరా పెన్షన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల తిప్పలు తప్పడం లేదు. జులైకు సంబంధించిన ఆసరా పెన్షన్లు వచ్చినట్లు తెలుసుకున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సోమవారం నర్సాపూర్ పోస్టాఫీస్ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ మేరకు గంటల తరబడి క్యూలో నిల్చుని ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన రేషన్‌కార్డుల పంపిణీ

టేక్మాల్(మెదక్): ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డు ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులకు నూతన రేషన్‌కార్డులుపంపిణీ చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులరాం, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు మల్లారెడ్డి, మాన్‌కిషన్, సుధాకర్, సంగమేశ్వర్‌గౌడ్, కిశోర్, మజుమర్, సాగర్, మహేష్‌రెడ్డి, అనిల్, సామెల్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు

చేగుంట(తూప్రాన్): హైదరాబాద్‌లో సీపీఎస్ రద్దు కోసం నిర్వహించే ఆత్మగౌరవ సభకు మండల కేంద్రం నుంచి తపస్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో నర్సింలు, ప్రసాద్‌రెడ్డి, తిరుపతి, పోచయ్య, దుర్గాప్రసాద్, ప్రభాకర్, స్వామి, సిద్ధూ, నరేందర్, తులసీరాం, సంతోష్, వెంకటేశ్, సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

◆ నిరసన..

చేగుంట(తూప్రాన్): పెన్షన్ విద్రోహదినంగా నిరసన తెలిపేందుకు టీఎస్ పీఆర్టీయూ సంఘం మండల నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈసందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, తిరుపతిరెడ్డి, నాయకులు విజయసేనారెడ్డి, శంకర్, రాజశేఖర్, రామకృష్ణ, స్వప్న, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ లేబర్ అడ్డాను పార్కుకు మార్చాలి

నర్సాపూర్: మండల కేంద్రంలో ఉన్న లేబర్ అడ్డాను పిల్లల పార్కుకు మార్చాలని ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియర్ జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి కోరారు. లేబర్ అడ్డా స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉండడంతో కూలీలతో పాటు దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

◆ బాధితులకు పరిహారం అందించాలి

హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని రాజ్‌పేటకి చెందిన సత్యనారాయణగౌడ్, యాదాగౌడ్‌లు వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బూర్గుపల్లి, కప్రాయిపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న బ్రిడ్జిలు, రోడ్లను పరిశీలించారు.

◆ శాంతి కమిటీ సమావేశం

నిజాంపేట(మెదక్): మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఎస్ఐ రాజేశ్ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తాజ్లల్, అబ్దుల్, మైనోద్దీన్, నసీరోద్దీన్ పాల్గొన్నారు.

◆ ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

నిజాంపేట(మెదక్): సమస్యల పరిష్కారం కోసం సోమవారం అసెంబ్లీకి వెళ్తున్న ఆశావర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బాలమణి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

◆ కొనసాగుతున్న మరమ్మతు పనులు

హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. మండల పరిధిలోని వాడి, రాజ్‌పేట, కప్రాయిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించే దిశగా అధికారులు పనులు వేగవంతం చేశారు.

◆ రోడ్డుపై దుకాణాలు పెడితే చర్యలు

నర్సాపూర్: జాతీయ రహదారిపై దుకాణాలు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లింగం, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణ పరిధిలోని రోడ్డుపై పర్యటించి రోడ్డుపై దుకాణాలు పెట్టిన వారికి అవగాహన కల్పించారు.

◆ పరిహారం చెల్లించండి

పాపన్నపేట(మెదక్): అకాల వర్షాలతో సర్వం కోల్పోయిన రైతులను పరామర్శించడం కాదని.. పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా కిసాన్ సెల్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచన మేరకు మండలంలోని కుర్తివాడ, ముద్దాపూర్, ఎల్లాపూర్, పొడిచన్‌పల్లి, ఆరెపల్లి, మల్లంపేట తదితర గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు.

◆ సోలార్‌లైట్లు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నిధులతో మంజూరైన సోలార్ హైమాస్ట్ లైట్లను బీజేపీ మండల అధ్యక్షుడు రాజు సోమవారం ప్రారంభించారు.

◆ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈకి పదోన్నతి

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక డివిజన్ నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ జగన్నాథంకు సంగారెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించగా.. సోమవారం బాధ్యతలు చేపట్టారు.

◆ బాధితులకు టార్పాలిన్లు అందజేత

రామాయంపేట(మెదక్): పట్టణంలో గుడిసెల్లో నివాసం ఉంటున్న 50 కుటుంబాలకు వీహెచ్‌పీ నాయకులు సోమవారం ఆహార కిట్లు, టార్పాలిన్లు పంపిణీ చేశారు.